# డాక్టర్ జిందాబాద్

డాక్టర్ దయానంద్, మనిషి మంచివాడే కానీ కోపం ఎక్కువ. తను చెప్పింది చెయ్యకపోతే ఎంతటివాడినైనా సరే, తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతాడు. అతనికి దగ్గరకు వచ్చిన రోగులు, "సార్ మీరు అలా అపకుండా, ఫీజు తీసుకుని కూడా తిట్టడం ధర్మం కాదు" అంటే, "సరే! ఈసారికి వదిలేస్తున్నాను, ఖబడ్దార్" అంటాడు.

డాక్టర్, పెద్దల నుంచి సంక్రమించిన ఇంట్లోనే ప్రాక్టీస్ పెట్టుకున్నారు. ముందుగదిలోనే క్లినిక్. షుగర్ ట్రీట్‌మెంట్ బాగా చేస్తాడని ప్రతీతి. ఓ నాలుగు నెలలపాటు తను చెప్పిన మందులు వాడిన తర్వాత కూడా, ఒక పేషెంట్ షుగర్ తగ్గలేదు.

"ఎందుకు తగ్గుతుంది? మీ అత్తారికి మామిడితోటలున్నాయని విన్నాను. ఇది మామిడిపళ్ల కాలం కదా! అత్తగారు అప్పనంగా ఇచ్చిన మామిడిపళ్లు ఇంట్లో ఇంకెవరూ తినకుండా, మటుమాయం చేసేసి ఉంటావు. అసలు మీ అత్తగారిని అనాలి" అంటూ లంకించుకున్నాడు, దయానంద్.

"సార్! నన్నేమన్నా ఫర్వాలేదు. నా అత్తగార్ని ఏమైనా అంటే ఊరుకోను. పెళ్లయినప్పట్నుంచీ ఏ ఉద్యోగం సద్యోగం చెయ్యకుండా నా అత్తగారి దయ వలన బ్రతికేస్తున్నాను".

"ఏం బ్రతుకుతున్నావ్. షుగర్‌తో చచ్చినట్లు బ్రతుకుతూన్న బ్రతుకూ ఓ బ్రతుకేనా!"

"ఫీజు తీసుకుని కూడా తిడతారేంటి సార్!"

"నీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడకు! ఏదో పెద్ద తిట్టినందుకు కూడా ఫీజు ఇచ్చినట్లు."

"మేం ఇచ్చిన ఫీజుకు తగినట్లుగా షుగర్ తగ్గడం లేదు"

"నీ ఇష్టమొచ్చినట్లు తీపి పదార్థాలు తింటే ఇక నీకు వైద్యం చెయ్యలేను"

ఇవన్నీ వింటున్న డాక్టర్‌గారి భార్య, క్లినిక్ తలుపు ఓరగా తీసి, "ఏమండీ! ఓసారి లోపలికి రండి!" అంది.

"ఏమిటండీ! మీరు మరీను, షుగర్ ఉంటే మాత్రం ఎన్నాళ్లు ఏమీ తినకుండా చస్తాడు"

"తింటే ఛస్తాడు! ఆ విషయం డాక్టర్‌గా నాకు తెలును"

"ఎవడైనా కొన్నాళ్లకి చచ్చిపోవలసిందే కదా! వచ్చిన ప్రతీ వాళ్లతో 'నేను వైద్యంచెయ్యను నీకు' అంటే, 'తీపి అప్పుడప్పుడు కొంచెం తినవోయ్' అనే డాక్టర్ దగ్గరకి పోతారు వాళ్లు! మా అమ్మావాళ్లకి మామిడితోటలు కూడా లేవు. ఆఖరికి మనం తినడానికి మామిడిపళ్లు కూడా ఉండవ్. పైగా వైద్యం చేసి డబ్బు సంపాదించకపోతే

ఈడొచ్చిన పెద్దపిల్లకి పెళ్లి ఎలా చేస్తాం? ఆ వచ్చినవాడ్ని మెల్లిగా సముదాయించి పంపండి"

"సారీ! పెద్దపిల్ల పెళ్లీడుకి వచ్చిన విషయం మరచిపోయాను"

క్లినిక్‌లోకి వస్తూనే "ఏమిటయ్యా పిచ్చేశ్వరరావ్! ఏదో బాధపడుతూన్నట్లు ఉన్నావ్! నేను ఇందాకా నీ మనస్సు నొప్పించినట్లున్నాను. చిన్నప్పుడు, అమ్మానాన్నలు, స్కూల్లో మాస్టారూ, షుగర్ వచ్చిన తర్వాత నేనూ అంటే డాక్టర్ తిట్టకపోతే, మీరెలా బాగుపడతారయ్యా! ఈమధ్య నువ్వొచ్చినప్పుడల్లా మామిడిపళ్లు ఎక్కువ తినవద్దని తిడుతూనే ఉన్నాను. పోనీ నువు తెలివిగా, ఓ పది పళ్లు పట్టుకొచ్చి డాక్టర్! ఇవి మీరు తినండి, అన్నావు కాదు! ఎక్కువగా తినద్దు అంటే, ఎదుటి వాళ్లకి పెట్టమనే కదా అర్థం! ఈ విషయం గ్రహించలేక పోయావ్! అందుకునే మీ వాళ్లు నీకు పిచ్చేశ్వరరావ్ అని పేరు పెట్టారు" అని గుక్క తిప్పుకోకుండా, తెలివిగా తిట్టాడు. పైగా "అప్పుడప్పుడు తిను ఫర్వాలేదు" అంటూ 'పోతేపోతాడు, తెలివైన నా భార్య చెప్పినట్లు' అనుకున్నాడు స్వగతంగా డాక్టర్.

"డాక్టర్‌గారికి పళ్లు ఇమ్మని మా ఆవిడ చెబుతూనే ఉందండి. కానీ మీకేమైనా షుగర్ ఉంటే, నీరసం వలన మళ్లీ తిడతారేమోనని భయపడి తేలేదండి"

"నీ మొహం! డాక్టర్లకి షుగరేమిటోయ్!"

"షుగర్ ఎక్కువున్నా, తక్కువగా ఉన్నట్లు 'రిపోర్టు' ఇచ్చే లేబొరేటరీ వాళ్లెవరనా ఉంటే చెప్పండి, డాక్టర్! మా ఆవిడకి తెలియకుండా ఓ యాభై మామిడిపళ్లు ఇస్తాను వాళ్లకి. ఈ షుగర్ రిపోర్టు చూసినప్పుడల్లా మా ఆవిడ నన్ను తిడుతోంది"

"ఏది ఎవర్ని అడగాలో కూడా తెలియని వెర్రి పిచ్చేశ్వరరావ్ నువ్! ఈ రోజుకి ఇక చాలు. వెళ్లిపో!"

ఇంతలో శ్రీమతి దయానంద్ "ఇక చాలు, లోపలికి రండి, భోంచేద్దురు గాని! మీరు తిడుతూన్న తిట్లు ఫలిస్తున్నాయ్! పేషంట్లు రోజురోజుకీ తగ్గిపోతున్నారు"

ఇంటిలోని పోరు ఇంతింతకాదయా అని కొన్ని కరపత్రాలు అచ్చువేయించి ఊళ్లో పంచిపెట్టించాడు, డాక్టర్! కరపత్రాల సారాంశం. 'షుగర్ ఒకసారి వస్తే ఎలాగూ తగ్గదు. మీకు నచ్చినవి తినండి. వైద్యానికి నా దగ్గరకి రండి. మీ ఆయుర్దాయం ఉన్నవాళ్లూ మిమ్మల్ని జాగ్రత్తగా చూసే బాధ్యత నాది'

ఈ కరపత్రాలు చూసి డాక్టర్ దయానంద్‌గారికీ 'జై' అంటూ చాలామంది షుగర్ పేషెంట్లు డాక్టర్‌గారి క్లినిక్ దగ్గర గుమిగూడారు.

---

(ఆంధ్రభూమి వారపత్రిక 9- 2-2012)